క్లుప్తంగా

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీఓ



తాడూరు: మండల కేంద్రంతో పాటు మేడిపూర్, అల్లాపూర్ గ్రామాల్లో నర్సరీలను గురువారం ఎంపీడీఓ ఆంజనేయులు ఏపీఓ చంద్రసిద్ధార్థ పరిశీలించారు. మొక్కలు ఎండకుండా నీటిని అందజేయడంతో పాటు గ్రీన్‌మ్యాట్‌ను ఉంచాలన్నారు. వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని కోరారు.

వాల్ పోస్టర్ విడుదల



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురువు సుఖ్‌దేవ్‌ల వర్ధంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్, శేఖర్, అంజి, శివకుమార్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని హోమం



అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాపనాశినిగుండం వద్ద పుణ్యస్నానమాచరించి గణపతిపూజ, శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు.

హమాలీలుగా అవకాశం ఇవ్వాలి

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని మద్యం డిపోలో హమాలీలుగా పని చేసేందుకు మండలంలోని ప్రతి నిరుద్యోగికి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు దానం బాల్‌రాజ్, ముబారక్‌లు కోరారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మద్యం డిపోలో 140 మంది పని చేసే అవకాశం ఉన్నప్పటికి 71 మంది మాత్రమే పని చేస్తున్నారని మరో 70 మందికి ఉపాధి కల్పించాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండాలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి గురువారం సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు రూ.1,10,116లు అందజేశారు. తండాకు చెందిన నాయకులు హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. లచ్చిరాం, సాయికుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

కల్వకుర్తి రూరల్: ప్రశాంతవాతావరణంలో పరీక్షలు రాయాలని సరస్వతి శిశుమందిర్ సమితి అధ్యక్షుడు లక్ష్మారెడ్డి కోరారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్, కార్యదర్శి మురళీధర్ రెడ్డి, నర్సిరెడ్డి, గుగ్గిల శంకర్, రాము, ఆంజనేయులు, మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నాగర్‌కర్నూల్‌రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీ ఆమోదం తెలపడంతో గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘం నాయకులు తిరుపతయ్య, సుధాకర్ గౌడ్, శివ, నవీన్, శ్రీనివాసులు, కుంభం మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు



తుమ్మలసుగురుకు వెళ్లే దారిలో..



తాడూరు నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్లే దారిలో

తాడూరు: మండలంలో పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలబారిని పడి ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మూలమలుపుల వద్ద సూచికబోర్డులు కూడా లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలం ఇలా...

మండల కేంద్రంనుంచి ఇంద్రకల్ మీదుగా ఎత్మతాపూర్ నుంచి తుమ్మలసుగురుకు వెళ్లే బీటీ రోడ్డు ఎత్మతాపూర్ సమీపాన మలుపులు తిరిగి రోడ్డు అంచుకు కాల్వ తీయడంతో ప్రమాదకరంగా మారింది, తిర్మలాపూర్ నుంచి ఇటిక్యాల వెళ్లే బీటీ రోడ్డు మలుపులు ఉండటంతో వాహనదారులు భయాందోళనకు గురువుతున్నారు. చెర్ల ఇటిక్యాల నుంచి తుమ్మలసుగురుకు వెళ్లే బీటీ రోడ్డు మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్‌రోడ్డు గగ్గలపల్లి సమీపాన అనేక మలుపులు తిరిగి ఉంది. ఐతోలు నుంచి బలాన్‌పల్లికి వెళ్లే బలాన్‌పల్లికి వెళ్లే బీటీరోడ్డుకు, శిర్సవాడ నుంచి పాపగల్‌కు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు శిర్సవాడ సమీపాన మలుపులు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటుకున్నాయి.

సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి



మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళ ప్రయాణం మరింత ఇబ్బందులకు గురిచేస్తుంది. అధికారులు స్పందించాలి.

– బోనాసి నరేందర్, మాజీ సర్పంచ్, తిర్మలాపూర్

రోడ్లను పరిశీలిస్తాం



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే పంచాయతీ పరిధిలో ఉన్న రోడ్లను సంబంధిత ఏఈతో కలిసి పరిశీలిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా.

– ఆంజనేయులు, ఎంపీడీఓ

విద్యాభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ



నాగర్‌కర్నూల్‌లో శుద్ధజల ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

కందనూలు: విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంట్‌ను, బొటానికల్ గార్డెన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పూలమొక్కలు నాటి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అంజయ్య, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రతినిధులు శ్రీనివాసరావు, శేఖర్, ముజీబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గొరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు రూ.4 లక్షల వ్యయం చేసే నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఎంఈఓ శ్రీనివాస్ రెడి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి, ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, అమ్మ ఆదర్శ చైర్మన్ రాములమ్మ, డీఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి



తెలకపల్లి: ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని అచ్చంపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పీఎస్ దేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆమె సందర్శించారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సహకరించాలని కోరారు. రెండు రోజుల్లో మరోక కంట్రోలర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆమె వెంట జి గోవర్ధన్, కంట్రోలర్ వెంకటేష్ ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కోడేరు: మండలంలోని గుండ్యావాల్యానాయక్ తండాకు చెందిన కాట్రావత్ చిట్టెమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.20 వేలు మంజూరయ్యాయి. గురువారం లబ్ధిదారురాలికి మాజీ ఎంపీటీసీ పార్వతి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్, విజయ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చారకొండ: మండల కేంద్రంలో మాదిగ జాగృతి సంఘం సెంట్రల్ కమిటీ సభ్యుడు రాధాకృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో గురువారం మాదిగ జాగృతి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మహరాజ్ మాట్లాడుతూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేష్, మాదిగ జాగృతి సంఘం నాయకులు విజయ్, వెంకటయ్య, శంకర్, నాగరాజు, ఉదయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి శత జయంతి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ, కల్వకుర్తి సాహితీ సమితి ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త తంగిరాల చక్రవర్తి హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాశరథి రచించిన కావ్యాలను, పాటలను గుర్తుచేశారు. కార్యక్రమంలో వహీద్ ఖాన్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, సుజాత, సుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్: అంబేడ్కర్ అభయహస్తం పథకం అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 శాతం జనాభా ఉన్న దళితులకు సరిపడ నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో కాశన్న, శ్రీనివాసులు, ఆంజనేయులు, విజయ్, రాము, బాలయ్య పాల్గొన్నారు.



కార్మికుల సంక్షేమానికి నిధులు పెంచాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో అమలుకు ప్రస్తుత ప్రతిపాదనలకు ఎలాంటి పొంతన లేదన్నారు. మహిళలకు రూ.2500 ఆర్థికసాయం పథకానికి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. దీనికి కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారన్నారు. ఇల్లు లేని 30 లక్షల మంది కుటుంబాలకు కేవలం 4 లక్షల కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదన పెట్టడం సరికాదన్నారు. ప్రైవేట్ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరుకావాలని ఆర్ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో బాలయ్య, ఆంజనేయులు, మల్లయ్య, యాదయ్య, గున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లులేని పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం బాలనరసింహ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక లక్ష్మణచారి భవనంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, ఫయాజ్, జిల్లా సభ్యులు నరసింహ, చంద్రమౌళి, కొమ్ము భరత్, శివశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల నిరసన

కొల్లాపూర్: విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడంతో గురువారం పట్టణంలో బీఆర్ఎస్వీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు దారాశేఖర్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.57 శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. విద్యాసంస్థల పటిష్టత కోసం, విద్యార్థుల సంక్షేమం కోసం కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్‌లో సవరణలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాం, స్వామి తదితరులు ఉన్నారు.



దివ్యాంగులను కించపర్చొద్దు

తిమ్మాజిపేట: దివ్యాంగులను కించపర్చొద్దని వారిని గౌరవించడం అందరి బాధ్యత అని డిప్యూటీ లీగలెట్ డిఫెన్స్ కౌన్సిల్ ఏసీపీ శ్రీరామ్‌ఆర్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శారీరక, మానసిక వికలాంగులను అవమానించడం సరికాదన్నారు. వారి హక్కులకు భంగం కలిగించొద్దన్నారు. దివ్యాంగులను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14416కు లేదా 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సరికాదు



అచ్చంపేట రూరల్: తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తొలగింపు సరికాదని ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఆర్యవైశ్య సంఘం అచ్చంపేట అధ్యక్షుడు ఆకుతోట లక్ష్మీనారాయణ కోరారు. గురువారం అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అంతకుముందు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాయలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విజయ్‌కుమార్, భాస్కర్, బాల్‌రాజు, పోలిశెట్టి నరేష్, రఘు, అశోక్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు



మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న మాదిగ ఉద్యోగులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో గురువారం పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో మాదిగలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. మాదిగ ఉద్యోగులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దేవరపాట ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం జాప్యం చేయకుండ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మందకృష్ణ మాదిగ తదితరుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని తూడుకుర్తిలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగులు కరెంట్ లక్ష్మయ్య, బాలస్వామి, ఎల్లపోగు లక్ష్మయ్య, నాయకులు ఆది సురేందర్, డీవీ స్వామి, భగవంత్, రామకృష్ణ, మనోజ్, శ్రీనివాసులు, భాస్కర్, కృష్ణ, కొంగరి ప్రవీణ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ కర్ణకర్ రెడ్డి, గంగనమోని వెంకటయ్య, బండి నరసింహ, బండి చెన్నయ్య తదితరులు ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



శాంపిల్స్ సేకరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని పవనపుత్ర హెచ్‌పీ ఫిల్లింగ్ స్టేషన్‌లో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు ఏఎస్ఓ హైదర్‌అలీఖాన్, సివిల్‌సప్లయ్ డీటీ దీపికలు తనిఖీ చేశారు. అధికారుల వివరాల ప్రకారం మండలంలోని గుండాల గ్రామానికి చెందిన పర్వత్‌రెడ్డి బుధవారం రాత్రి పెట్రోల్ బంక్‌లో ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోసుకున్నారు. కొద్దిదూరం వెళ్లే సరికి వాహనం నిలిచిపోయింది. గురువారం బైక్ మెకానిక్ చూయించగా పెట్రోల్‌లో నీరు ఉందని తెలిపాడు. దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. విజిలెన్స్ అధికారులు పెట్రోల్‌బంక్‌లో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పెట్రోల్‌ను శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌లో పరీక్షల కోసం తీసుకెళ్లారు. కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

తైబజార్ వేలం పాట రూ.2.75 లక్షలు

పెద్దకొత్తపల్లి: పెద్ద గ్రామ పంచాయతీలో గురువారం తైబజార్ గొర్రెలు, మేకల సంత షెటర్లకు వేల పాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నాగేషు తెలిపారు. గొర్రెలు మేకల సంత గడ్డిగోపుల ఎల్లయ్య రూ.2.60 లక్షలకు దక్కించుకున్నారు. రెండు షెటర్లను మిద్దె రామకృష్ణ ఒక షెటర్ రూ.7,500లకు, రెండో షెటర్‌ను రూ.7,500 లకు గడ్డిగోపుల పవన్ దక్కించుకున్నారు.

25న తైబజార్ వేలం

కొల్లాపూర్: పట్టణంలో తైబజారు వసూళ్ల కోసం ఈనెల 25వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తెలిపారు. ఆసక్తి గల వారు 24వ తేదీలోపు వేలంలో పాల్గొనేందుకు డిపాజిట్ రుసుము చెల్లించాలని సూచించారు. వేలం దక్కించుకున్న వారు సంవత్సరం పాటు తైబజారు వసూలు చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన



వెల్దండ: కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగాగా ముందుకు వెళ్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బిల్లులకు ఆమోదం తెలపడం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నరేష్, నాయకులు కొమ్ము అంజయ్య, గోపాల్‌నాయక్, వినోద్, శంకర్‌నాయక్, దశరథ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన జూలూరు కుమారస్వామి ఇంట్లో నిల్వ ఉంచిన నాలుగున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు రెండో ఎస్ఐ రామచందర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో సివిల్ సప్లయ్ డీటీ రాఘవేందర్ రెడ్డి, కల్వకుర్తి పోలీసులు పంజుగుల గ్రామంలో తనిఖీ చేశారు. డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటాలు



పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు రిలేనిరాహార దీక్షలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ అన్నారు. 20 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం భూమిని కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమంతు, రామస్వామి, చిట్టెమ్మ, లక్ష్మీ దేవమ్మ, తిమ్మస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో రాజకీయ జోక్యం ఉండొద్దు



కొల్లాపూర్: అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం పథకం అందించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు నగదురూపంలో సహాయం అందించాలన్నారు. పథకం అమలులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దళితబంధు రెండో విడత యూనిట్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పసుపుల కుమార్, శీలం వెంకటస్వామి ఉన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ



మన్ననూర్: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలలో 10 పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో ఎక్కువ మార్కులు (గ్రేడ్) సాధించిన వారికి మొదటి బహుమతిగా రూ. 5000, ద్వితీయ బహుమతి రూ. 3000, తృతీయ బహుమతి రూ. 2000 అందిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి, నాయకులు బుచ్చయ్య, వెంకటరమణ, సత్యనారాయణ, రాఘవేంధర్, రాజారాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం తీన్మార్ మల్లన్న టీం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీం సభ్యుడు రుక్కులు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమాదేవి, పుష్పలత, వినయశీల, నాగేషు, ఆనంద గౌడ్, సునంద తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణపై అవగాహన

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో గురువారం టీబీ నిర్ధారణపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించి, అనుమానితుల నుంచి తెమడ (కళ్లే) సేకరించారు. వ్యాధి ఎక్కువగా ధూమపానం చేసేవారికి వస్తుందని, వ్యాధి సోకిన వారు బయట తిరగడం, ఉమ్మడం చేయరాదన్నారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని సూచించారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకహారం తీసుకునేందుకు ప్రతి నెల రూ.1000 అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు వారాలకు మించి ఎడతెగని దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం, ఆలసట, రాత్రి పూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, ఛాతీ ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం టీబీ ప్రాథమిక లక్షణాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.